Siraj IPL Cricketer

మహ్మద్ సిరాజ్...

కొన్ని నెలల క్రితం వరకు తనతో కలిసి ఆడేవాళ్లకు తప్ప ఈ పేరు ఎవరికీ తెలియదు.

ఇప్పుడు అతను క్రికెట్ ప్రపంచానికి సుపరిచితం.

ఇలా బంతి పట్టుకుని తిరుగుతూ ఉంటే నువ్వెప్పుడు బాగుపడతావురా అని తల్లి షబానా ఆందోళన పడినా... సిరాజ్ అధైర్యపడలేదు.

ఆటో నడుపుతూ కుటుంబాన్ని కష్టంగా నెట్టుకొస్తున్న తండ్రి గౌస్‌కి సాయపడాలని రంగులువేసే పనికికూడా వెళ్లాడు.. కానీ... ఎంచుకున్న రంగాన్ని మాత్రం వదిలిపెట్టలేదు.

ఆటను నమ్ముకున్నాడు... అనుకున్న లక్ష్యం సాధించడానికి పట్టుదలతో వేట సాగించాడు.

గల్లీల్లో దోస్తులతో టెన్నిస్ బాల్‌తో మొదలైన సిరాజ్ బౌలింగ్ ప్రాక్టీస్.. ఐపిఎల్ సీజన్ 10 వేలంలో అతన్ని 2కోట్ల 60 లక్షలకు కొనుగోలు చేసేవరకు తీసుకెళ్లింది. ఆటోవాలా కొడుకు ఐపిఎల్‌కి సెలెక్ట్ అయ్యాడని, సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతున్నాడని దేశమంతా గొప్పగా చెప్పుకున్న క్షణాన సిరాజ్ మనసులో మెదిలిన మాట ఒక్కటే. అమ్మానాన్నకు మంచి ఇల్లు కొనిపెట్టాలి అని. గ్రౌండ్‌లో వికెట్లు పడగొట్టకముందే ఎంతోమంది హృదయాల్ని కొల్లగొట్టిన మాట అది.

హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్ సమీపంలోని ఖాజానగర్‌లో ఒక ఇరుకైన అద్దె ఇల్లు. ఇక్కడినుంచే సిరాజ్ భారత క్రికెటర్ కావాలని కలలుగన్నాడు. ఎలాంటి శిక్షణాలేకుండా నే 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తున్న సిరాజ్‌లోని సహజ ప్రతిభను గుర్తించారు కోచ్ అద్నాన్. ఆయన మార్గనిర్దేశనంలో లీగ్ స్థాయి క్రికెట్‌లోకి ప్రవేశించిన ఈ బౌలర్ 59 వికెట్లు తీసి HCA సెలక్టర్ల దృష్టిలో పడటానికి ఎంతోసమయం పట్టలేదు. రాజకీయాలు, రికమండేషన్లకు అడ్డాగా పేరున్న హైదరాబాద్ క్రికెట్‌లోకి కేవలం ప్రతిభతోనే దూసుకొచ్చిన పేసర్ మహమద్ సిరాజ్. హైదరాబాద్ అండర్-23 జట్టు తరఫున 29 వికెట్లు పడగొట్టడంతో వెంటనే రంజీల్లో చోటు దక్కింది. గత సీజన్‌లో 41 వికెట్లతో దేశంలోనే మూడో స్థానంలో నిలిచిన సిరాజ్... ఇరానీ కప్, ఇండియా 'A' టీమ్‌కి ఎంపికయ్యాడు. ఆ వెంటనే ఐపీఎల్ 10లో అడుగుపెట్టాడు. సిరాజ్ ప్రయాణం... అతను సాధిస్తున్న విజయాలు... ఎంతోమంది యువతలో క్రీడాస్ఫూర్తిని రగిలిస్తాయనడంలో సందేహంలేదు. ఎంతోమంది తల్లిదండ్రుల్లో పిల్లల్ని ఆటలవైపు నడిపించాలనే ఆసక్తి రేకెత్తించిన మహ్మద్ సిరాజ్‌ని సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2016 యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ గా సత్కరిస్తోంది సాక్షి.